ఓ పోలీసు అధికారిణి భర్త..
ఓ ఏఎస్‌ఐ అక్రమాలు కోకొల్లలు..

జిల్లాలో ఓ పోలీసు అధికారిణి టీడీపీ వారిని పరోక్షంగా ఇబ్బందులకు గురిచేశారు. రెండేళ్ల నుంచి జిల్లాలో మకాం వేసిన ఓ పోలీసు అధికారిణి భర్త.. ఓ ఏఎస్‌ఐతో కలిసి చేస్తున్న అక్రమాలపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఎచ్చెర్లకు చెందిన సామాజిక కార్యకర్తగా చెలామణి అవుతున్న వ్యక్తితో కలిసి భారీ సెటిల్‌మెంట్లకు తెరతీశారు. సామాజిక వర్గం కలిసిరావడంతో అసలు విధులు నిర్వహించకుండా ఏఎస్‌ఐ, అలాగే పోలీసుల అధికారిణి భర్తకు అడుగులకు మడుగులు వత్తుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. పశువుల రవాణాకు సంబంధించి వాహనదారులు.. అలాగే జిల్లాలో ఇసుక.. ఇతరత్రా వాటికి సంబంధించి ముడుపులను నేరుగా వీరిద్దరితోనే మాట్లాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇంతవరకు మౌనంగా ఉన్న వారందరూ ఇప్పుడు గళం విప్పుతున్నారు. మొన్నటివరకు సామాజికవర్గం పేరు చూపి.. ఆమదాలవలస నియోజకవర్గంలో ముందుగా విధులు నిర్వహించిన కొంతమంది పోలీసులు.. ఇప్పుడు శ్రీకాకుళం నియోజకవర్గంలోనూ.. అలాగే ఎస్పీఎఫ్ విభాగానికి చెందినవారు కూడా పోలీసు కమ్యూనికేషన్ విభాగంలో వైసీపీ నాయకుల సిఫారసుతో విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లందరికీ వణుకు ఆరంభమైంది. ఇందులో కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలను కలుస్తూ.. తమ పోస్టింగ్‌లను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. కానీ అన్నీ తెలిసిన జనం మాత్రం.. ప్రక్షాళన చేపడితేనే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందని భావిస్తున్నారు.



వైసీపీ వీరవిధేయుల్లో వణుకు

- ఐదేళ్లూ అధికారపార్టీ నాయకులతో అంటకాగారు
- ప్రతిపక్ష నేతలను వేధించడంలో పోలీసులు ముందంజ
- ఓ పోలీసు అధికారిణి భర్త అక్రమాలకు అదుపే లేదు
- జిల్లా శాఖ అధికారులు సైతం వత్తాసు
- విచ్చలవిడిగా సహజవనరుల దోపిడీ
- ప్రభుత్వ మార్పుతో అక్రమార్కులపై చర్యలకు సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో రాజకీయ నాయకుల మాదిరిగా అత్యధిక మంది అధికారులు పోటీపడి అధికార పార్టీనేతలతో అంటకాగారు. ప్రజలకు జవాబుదారీగా లేకుండా.. చాలామంది స్వామిభక్తిని చాటుతూ.. వైసీపీ నేతలకు వీరవిధేయులుగా సేవలందించారు. వారి అక్రమాలకు సహకరించారు. ప్రధానంగా ప్రతిపక్షమైన టీడీపీ నేతలను, ప్రభుత్వ తీరును ప్రశ్నించే వారిని వేధించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో.. ఇటువంటి అధికారులందరిలో ఇప్పుడు వణుకు మొదలైంది. అప్పుడు వీరవిధేయత్వం చూపి టీడీపీని.. సామాన్యప్రజలను ఇబ్బంది పెట్టేందుకు సహకరించిన అధికారుల జాబితా సిద్ధమైంది. త్వరలో ప్రక్షాళన జరిగే అవకాశముండడంతో ఎవరిపై వేటు పడుతుందోనన్న గుబులు అధికారులను వెంటాడుతోంది.

ముందువరుసలో... పోలీసులు

ఐదేళ్లకోసారి కొత్త ప్రభుత్వం కొలువుతీరుతుంది. ప్రజలకు మంచి సేవలందిస్తారన్న నమ్మకమున్న అధికారులను రాష్ట్రంలో ఎక్కడున్నా తమ ప్రాంతానికి తెప్పించుకుని.. వారికి ప్రాధాన్య పోస్టులను కట్టబెట్టేవారు. ఏ ప్రభుత్వమైనా ఇదే పద్ధతిని అనుసరిస్తుంది. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో మాత్రం ఉద్యోగుల నియామకాలు.. వారిని ఉపయోగించుకున్న తీరు పలు విమర్శలకు దారితీస్తోంది. శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత పోలీసు శాఖదే. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును అరెస్ట్ చేసేందుకు.. అప్పట్లో కొద్దిరోజుల ముందు శ్రీకాకుళం ఎస్పీగా ఓ 'రెడ్డి'ని వైసీపీ ప్రభుత్వం నియమించింది. పోలీసులు మూకుమ్మడిగా ప్రత్యేక బలగాలతో గోడలు దూకి అచ్చెన్నాయుడును అరెస్ట్ చేశారు. అతనికి శస్త్రచికిత్స జరిగి రెండురోజులు కూడా గడవకున్నా అరెస్ట్‌చేసి రాష్ట్రమంతా తిప్పారు. అచ్చెన్న అరెస్ట్ తర్వాత ఆ ఎస్పీకి పదోన్నతి లభించింది. ఇక టెక్కలి నియోజకవర్గ వైసీపీ నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. అచ్చెన్నపై పెట్టించిన అక్రమ కేసులు అనేకం. మైకులో కూడా అభ్యంతరకర పదాలను ఉపయోగిస్తూ ప్రతిపక్ష నాయకుల్ని ఇబ్బందులకు గురి చేసినా ఆయనపై తీసుకున్న చర్యలు శూన్యం. టెక్కలిలో జనసేన కార్యాలయంపై దాడి చేసి నిప్పుపెట్టిన వారిపైనా పోలీసులు చర్యలు తీసుకోలేదు. టెక్కలి, పలాస డివిజన్‌లకు నియమించిన డీఎస్పీలు కూడా జగన్‌కు అత్యంత వీరవిధేయులుగానే చలామణిఅయ్యారు. టీడీపీ కార్యకర్తలు.. టీడీపీ సానుభూతిపరులు గ్రామానికి దూరంగా ఉన్నా సరే అధికమందిని వేధించే విషయంలో అప్పటి పలాస సీఐ శంకరరావు ఏకపక్షంగా వ్యవహరించేవారు. మహిళా టీడీపీ నేత గౌతు శిరీషను దూషించి.. సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లు పెట్టినాసరే వైసీపీవారిపై చర్యలు తీసుకోలేదు. టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసేలా డీఎస్పీ కూడా వ్యవహరించారు. ఇవన్నీ నారా లోకేష్ రెడ్ డైరీలో నమోదయ్యాయి.



అక్రమాలపై నోరుమెదపని అధికారులు

సమగ్రశిక్ష అధికారి నియామకం నుంచి.. ఆ కార్యాలయంలో కొంతమంది సిబ్బందిని నియమించుకోవడంలో మొన్నటివరకు రాజ్యాంగ బద్ధమైన పదవిలో వ్యవహరించిన వైసీపీ నాయకుడు పరోక్షంగా భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. అధికారి కూడా సహకరించడంతో ఇరువురికి లాభదాయకంగా సమగ్ర శిక్ష కార్యాలయం అనువుగా మారింది. ఇక శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డులో ఆదివారంపేట ఆవల నాగావళి గట్టుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఓ తహసీల్దార్ దర్జాగా రికార్డులను మార్చి వైసీపీకి చెందినవారి నుంచి రూ.కోట్లలో ముడుపులు తీసుకుని భారీ లబ్ధి చేకూర్చారు. ఆ స్థలం విలువ ఎన్ని కోట్లు చేస్తున్నదీ అంచనా కూడా వేయలేని పరిస్థితి ఇప్పుడుంది. తహసీల్దార్‌కే అంతటి ముడుపులు అం దితే.. ఆపై ఉన్న అధికారుల సంగతి చెప్పనక్కర్లేదు. డీఎంహెచ్‌వో నుంచి డీఈవో వరకు విధుల నిర్వహణలో అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది.

- జిల్లాలో చాలామంది అధికారులు వైసీపీ నాయకులకు తొత్తుల్లాగానే పనిచేశారు. జిల్లాలో మైనింగ్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఉన్నారన్న విషయం ప్రజలు మరిచిపోయారు. టెక్కలిలో ప్రాంతంలో గ్రానైట్ క్వారీ ఒకటి చూపించి మరోచోట తవ్వకాలు జరుగుతున్నా వైసీపీ ఎమ్మెల్సీకి చెందినవి కావడంతో కనీస తనిఖీలు కూడా చేయలేక పోయారు. ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా.. వాటాల కోసం చూపిన శ్రద్ధ.. చర్యల విషయంలో ముందడుగు వేయలేక పోయారు. ఇందులో రెవెన్యూ అధికారుల నుంచి ఎస్‌ఐల వరకు ఉన్నారు. హోటళ్లలో తనిఖీలు మరిచి కేవలం నెలవారీ మామూళ్ల మత్తులో అధికారులు ఉన్నారు.



ఇటువంటి అధికారులంతా ప్రభుత్వ మార్పుతో దుకాణం సర్దుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఐదేళ్లలో అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకునే విషయంలో టీడీపీ నాయకులు పట్టుపడుతున్నట్లు సమాచారం. ఏడాదిన్నర కిందట కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన టీడీపీ బృందంపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. పూర్వపు కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో పాలన జరిగిందని.. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారులను సైతం మార్పిడి చేయాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. త్వరలో ప్రక్షాళన ఖాయమని తెలుస్తోంది.

అమాత్యులెవరో?

- అచ్చెన్నకు బెర్త్ ఖరారు... శాఖ సంగతే తెలియదాయె
- ఆశావహుల జాబితాలో అశోక్, కూన రవి, శిరీష
- మంత్రివర్గంలో జిల్లాకు దక్కనున్న అత్యంత ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక పోరులో గత ఎన్నికల లెక్కలను తిరగరాస్తూ.. ఎన్డీయే కూటమి జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసింది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు.. ఒక లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి సునామీకి వైసీపీ తట్టుకోలేకపోయింది. ఆదివారం కేంద్రప్రభుత్వం.. కొద్దిరోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కొలువు తీరనున్నాయి. జిల్లా నుంచి మంత్రి పదవి ఎవరికి వరించనున్నదోనని చర్చ జరుగుతోంది.

కేంద్రమంత్రిగా రామ్మోహన్ నాయుడు!



ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్రమంత్రి పదవి లభించనున్నట్లు సమాచారం. వరుసగా మూడోసారి గెలిచిన ఆయన.. ఇంతవరకు జిల్లాలో ఏ ఎంపీకి లభించని మెజార్టీని సొంతం చేసుకున్నారు. ఈ దఫా ఎన్డీఏలో టీడీపీ భాగస్వామ్యమైంది. ఇప్పటికే పార్లమెంట్‌లో తనవాణిని వినిపిస్తూ దేశవ్యాప్తంగా రామ్మోహన్ గుర్తింపుపొందారు. ఢిల్లీ స్థాయిలో రాష్ట్ర ప్రయోజనాలకోసం తన తండ్రి దివంగతనేత కింజరాపు ఎర్రన్నాయుడు మాదిరిగానే పనిచేసేతత్వం ఉండటాన్ని చంద్రబాబు గుర్తించారు. కేంద్ర మంత్రివర్గంలోకి రామ్మోహన్‌కి కచ్చితంగా అవకాశం ఇవ్వనున్నట్లు తాజా సమాచారం. విద్యావంతుడు కావడం... మూడుదఫాలు లోక్‌సభలో ప్రజాసమస్యలపై గళమెత్తడం కారణంగా ఆయనకు ప్రతిభకు తగ్గట్టుగా మంత్రిత్వ శాఖను కేంద్రం ఇస్తుందని తెలుస్తోంది.

అచ్చెన్నకు దాదాపు ఖరారు

కింజరాపు అచ్చెన్నపై పలు కేసులు నమోదుచేసి చాలాతీవ్రంగా వైసీపీ ప్రభుత్వం వేధించింది. ఏమాత్రం బెదరకుండా అచ్చెన్న కేసులను ఎదుర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు రవాణా శాఖ, కార్మికశాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు పదవీబాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అచ్చెన్నకు మంత్రి పదవి దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. కొన్నినెలల క్రితం టెక్కలిలో జరిగిన 'యువగళం' సభలో స్వయంగా ఎంపీ రామ్మోహన్‌నాయుడే మాట్లాడుతూ అచ్చెన్నాయుడుకి హోంశాఖ ఇవ్వాలని నారా లోకేష్‌ను కోరారు. ఆ విషయం చంద్రబాబు చూసుకుంటారని లోకేష్ బదులిచ్చారు. అయితే మంత్రిపదవి ఇవ్వడమన్నది దాదాపు ఖాయమన్నది సమాచారం. అయితే ఏ శాఖ అన్నదీ స్పష్టతలేదు. చంద్రబాబుకు కుడిభుజంలా ఉంటున్న అచ్చెన్నకు తప్పకుండా ప్రాధాన్యం ఇస్తారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నారు.



బెండాళం అశోక్



అచ్చెన్నాయుడు



శిరీష



కూన రవికుమార్

ఆశావహుల్లో ఆ ఇద్దరు..

2014లో గెలిచిన కూన రవికుమార్‌కు విప్ పదవిని ఇచ్చారు. ఆతర్వాత 2019లో ఓటమిపాలైన రవికుమార్.. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా స్పీకర్ తమ్మినేని సీతారాంను బలంగా ఢీకొని.. అక్రమ కేసులకు వెరవకుండా టీడీపీకి పూర్వవైభవాన్ని తెచ్చిపెట్టారు. అధికారపార్టీ అవినీతిని ఎండగడుతూ తమ్మినేనికి ఘోర పరాజయాన్ని రుచి చూపించారు. జిల్లాలో అధికంగా ఉన్న కాళింగ సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో కూన రవికి అమాత్య పదవి లభిస్తుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక ఇచ్ఛాపురం నుంచి వరుసగా మూడుదఫాలు గెలిచిన బెందాళం అశోక్ పేరు కూడా పరిశీలనలో ఉంది. పార్టీలో కీలకవ్యక్తులందరి ఆశీస్సులు అశోక్‌కు ఉన్నాయి. మంత్రిపదవి వరిస్తుందో.. లేదో.. త్వరలో తేలుతుంది


రేసులో గౌతు శిరీష కూడా..

ఐదేళ్లపాటు మహిళ అని చూడకుండా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషపై వైసీపీ మూకలు సోషల్‌మీడియా వేదికగా హింసించాయి. వైసీపీ నేతలు ఆమె అనుచరులందరిపై అక్రమ కేసులను నమోదు చేయించారు. టీడీపీ సానుభూతిపరులను సైతం వేధించారు. ఇవన్నీ ఓపిగ్గా భరించి.. శిరీష స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజును ఎదిరించి మట్టికరిపించారు. ఆమె తండ్రి గౌతు శివాజీ అంటే అత్యంత మక్కువ చంద్రబాబుకు. సీదిరి పెట్టిన ఇబ్బందులను ఎదుర్కొన్న శిరీషకు అమాత్యపదవి వరిస్తుందా? ఇతర ప్రాధాన్యం ఉన్న పదవిలో నియమిస్తారా? అన్న ప్రచారం సాగుతోంది.

ఎత్తిపోతలు.. ఎదురుచూపులు

- 'పొన్నాడ' పథకాన్ని పునరుద్ధరించాలని రైతుల విజ్ఞప్తి

(ఎచ్చెర్ల)



పొన్నాడ వద్ద నాగావళి నది ఒడ్డున గతంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల ప్రదేశం ఇదే

సాంకేతికత అభివృద్ధి చెందని ఆ రోజుల్లోనే రైతులు సమష్టిగా ముందుకు సాగారు. సాగునీటి కష్టాల పరిష్కారానికి నడుం బిగించి ఎచ్చెర్ల మండలం పొన్నాడ వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా పంటల సమృద్ధి సాధించారు. కొన్నేళ్లపాటు ఆ పథకాన్ని సమర్థవంతంగానే నిర్వహించారు. నారాయణపురం కాలువ అందుబాటులోకి రావడంతో ఈ ఎత్తిపోతలపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. దీంతో కొన్నాళ్లుగా ఈ ప్రాంత రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఏడు దశాబ్దాల కిందటే..

నాగావళి నది ఒడ్డున పొన్నాడ వద్ద ఏడు దశాబ్దాల కిందటే ఎత్తిపోతల పథకం రూపం దాల్చుకుంది. 1954-55లో స్థానిక గ్రామపెద్ద పంచిరెడ్డి నీలయ్య అధ్యక్షతన పొన్నాడ డేనియల్ పర్యవేక్షణలో రైతుల సహకారంతో ఎత్తిపోతలను ఏర్పాటు చేసి ఆయిల్ ఇంజన్ల ద్వారా నడిపించారు. ఈ ఎత్తిపోతల ద్వారా పొన్నాడ, వెంకన్నగారిపేట, తెప్పరేవు గ్రామాలకు చెందిన సుమారు 700 ఎకరాలకు సాగునీటిని అందించారు. ఆరేడు సంవత్సరాల పాటు ఈ పథకం బాగానే నడిచింది. ఆ తర్వాత నారాయణపురం ఆనకట్ట నిర్మించడంతో ఈ ప్రాంతానికి సాగునీరు అందింది. దీంతో పొన్నాడ ఎత్తిపోతలను నిర్లక్ష్యం చేశారు.

కుడి కాలువ కింద ఉన్నా..

నారాయణపురం ఆనకట్ట కుడి కాలువ కింద శివారున ఉన్న ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం, పొన్నాడ, బొంతల కోడూరు, ధర్మవరం, కొంగరాం, ముద్దాడ, కొత్తపేట, భగీరథపురం తదితర గ్రామాలకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కాలువ ద్వారా సకాలంలో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంటలు ఆశించిన స్థాయిలో పండడంలేదు. నారాయణపురం ఆధునికీకరణ పనులకు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జైకా నిధులు మంజూరైనా... పనులు మాత్రం పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పొన్నాడ వద్ద ఎత్తిపోతల పునరుద్ధరణతో ఎంతో ప్రయోజనమని రైతులు అభిప్రాయ పడుతున్నారు. పొన్నాడ కొండపై మోటారు షెడ్‌ను నిర్మించి అక్కడి నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో నారాయణపురం 24/2 బ్రాంచ్ చానల్ హెడ్ వద్ద (తోటపాలెం సమీపంలో) నీరు విడిచిపెడితే శివారు గ్రామాలకు సాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. ఎత్తిపోతల ద్వారా బ్రాంచ్ చానల్‌లోకి పంపిన నీటి ద్వారా తమకు ఇబ్బందులు తొలగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పొన్నాడ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పునరుద్ధరించాలి



సుమారు ఏడు దశాబ్దాల కిందట పొన్నాడలో నాగావళి నది ఒడ్డున ఎత్తిపోతలను ఏర్పాటు చేశారు. ఈ పథకం కొన్నాళ్ల తర్వాత మరుగున పడిపోయింది. తాజాగా ఈ ఎత్తిపోతల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి నిధుల మంజూరు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- పంచిరెడ్డి కృష్ణారావు, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, పొన్నాడ

ఆ వంతెన పూర్తయితే.. 25 గ్రామాలకు మేలు

- దశాబ్దాలుగా ప్రజల ఎదురుచూపు
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు
- ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ఉప్పుటేరుపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

(సోంపేట)

ఉప్పుటేరు వంతెన నిర్మాణం కోసం వేలాది మంది మత్స్యకారులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. సోంపేట, మందస మండలాల పరిధిలోని 25 మత్స్యకార గ్రామాల్లో సుమారు 40 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వారంతా.. సముద్రంలో వేటాడి తెచ్చిన మత్స్యసంపదను గ్రామాల్లో విక్రయించాలన్నా.. ఉప్పుటేరు వంతెన లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో మరింత అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పుటేరుపై వంతెన నిర్మించాలని ఏటా అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు.

సోంపేట మండలం ఎర్రముక్కాం నుంచి మందస మండలం తోటూరు మీదుగా.. మళ్లీ సోంపేట మండలం ఎకువూరు వరకూ ఉప్పుటేరు ప్రవహిస్తోంది. ఈ ఉప్పుటేరుపై సుమారు మూడు కిలోమీటర్ల మేర వంతెన నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు, మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుంది. మత్స్యకారులు మత్స్య సంపదను సోంపేట ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాలన్నా, ఈ ప్రాంత విద్యార్థులు బారువ, సోంపేటలోని విద్యా సంస్థలకు వెళ్లాలన్నా ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుంది. ఈ ప్రాంతంలో గిడ్డంగుల సదుపాయం, ఇతర మార్కెట్ అవకాశాలు లేవు. దీంతో స్థానిక మత్స్యకారులు వేటాడిన మత్స్య సంపదను వేరొక ప్రాంతాలకు వెళ్లి విక్రయించాలి. ఈ వంతెన పూర్తయితే దూరం తగ్గడంతో పాటు ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో సైతం మత్స్యకారులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలు కలుగుతుంది. అలాగే రవాణా సౌకర్యాలు ఏర్పడి, మత్స్య సంపదకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది. కాగా.. వంతెన లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఆ నీటి ప్రవాహం నుంచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ తాతల కాలం నుంచీ వంతెన నిర్మాణానికి ఎదురు చూపులే మిగిలాయని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఉప్పుటేరు వంతెన నిర్మిస్తామని నేతలు హామీ ఇస్తున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సారైనా నెరవేరేనా?

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి రూ.5.96 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో కేంద్ర బృందం కూడా ఉప్పుటేరును పరిశీలించింది. కానీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పటివరకూ పనులు ప్రారంభం కాలేదు. ఎన్డీయే కూటమిలో భాగంగా తాజాగా.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించారు. దీంతో టీడీపీ ప్రభుత్వంపైనే మత్స్యకారులు ఆశలు పెట్టుకున్నారు. ఈసారైనా తమ కల నెరవేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. దశాబ్దాల తరబడి ఎదుర్కొంటున్న తమ సమస్యకు పరిష్కారం చూపాలని.. ఉప్పుటేరు నిర్మించాలని కోరుతున్నారు.

ఇప్పుడైనా పూర్తిచేయాలి..



ఏళ్ల తరబడి వంతెన నిర్మాణం కోసం ఎదురు చూపులే మిగిలాయి. ఈసారి వంతెన నిర్మాణం పూర్తి అవుతుందని ఆశిస్తున్నాం. మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే ఉప్పుటేరు వంతెన నిర్మాణం పూర్తిచేస్తే ఎంతో మేలు చేసినట్టవుతుంది.

-వాసుపల్లి కృష్ణ, ఎకువూరు, సోంపేట



ఉప్పుటేరును పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)



లక్ష్మింపురం సమీపంలో మాలపేట గెడ్డ ఇలా..

స్వరూపం కోల్పోయిన గెడ్డలు

టెక్కలి, జూన్ 8: టెక్కలి, నందిగాం మండలాల రైతులకు ఖరీఫ్‌లో సాగునీరు అందించే మాలపేటగెడ్డ, దుర్గగెడ్డలు స్వరూపం కోల్పోయాయి. మెళియాపుట్టి మండలం ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపునీరు మాలపేటగెడ్డ ద్వారా నెల్లూరు, లక్ష్మింపురం, రాంపురం, గూడేం తదితర గ్రామాలకు సాగునీరు అందిస్తుంది. మెళియాపుట్టి కొండలపై పడిన వర్షపునీరు ద్వారా దుర్గగెడ్డ వెంబడి బెండకాయలపేట, మొఖలింగాపురం, నర్సింగపల్లి, చిరుతునాపల్లి ప్రాంతాలకు సాగునీరందేది. ఈ రెండు గెడ్డల ద్వారా వచ్చే వర్షపునీరు ఎక్కువైతే.. టెక్కలి సమీపంలోని మదనగోపాలసాగరానికి క్యాచ్‌మెంట్ ఏరియా రూపంలో కలుస్తుంది. గడిచిన ఐదేళ్లుగా ఈ గెడ్డల్లో తట్టెడు మన్ను తీయకపోవడం, జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో కాలువలు అధ్వానంగా మారాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీరందే పరిస్థితి లేదని రాంపురం సర్పంచ్ పినకాన జోగారావు, నర్సింగపల్లి మాజీసర్పంచ్ పోలాకి షణ్ముఖరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గెడ్డలు మరమ్మత్తులు చేస్తే వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నర్సింగపల్లి సమీపంలో దుర్గగెడ్డ దుస్థితి..


అరసవల్లి: ఫిలిం సిటీలో రామోజీరావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు


నరసన్నపేట/పోలాకి: నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో..


ఎచ్చెర్ల: ఎస్ఎం పురంలో టీడీపీ నాయకులు..


పొందూరు: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


రణస్థలం: నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు


టెక్కలి: నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


అరసవల్లి: జిల్లా కేంద్రంలో టీడీపీ నాయకులు

రామోజీరావు మృతికి సంతాపం

అరసవల్లి: ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాదులోని ఫిలిం సిటీలో రామోజీ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కవిటి/కంచిలి:** రామోజీరావు మృతి తీరని లోటని కవిటి, కంచిలి టీడీపీ నాయకులు అన్నారు. శనివారం ఆయా మండలాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జనసేన పార్టీ నాయకులు లోల్ల రాజేష్ ఆధ్వర్యంలో సంతాపభ సభ ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు బంగారు కురయ్య, మాదిని రామారావు, పైల పురుషోత్తం, సూర్యనారాయణ, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** రామోజీరావు మృతి తీరని లోటని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, నాయకులు సహదేవ్‌రెడ్డి, దక్కత కామేష్, ఎన్.కోటి తదితరులు పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:** ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి టీడీపీ నేతలు శనివారం నివాళులర్పించారు. ఎచ్చెర్లలోని టీడీపీ కార్యాలయంలో, ఎస్ఎం పురంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధంజలి ఘటించారు. ఎస్ఎం పురంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, పార్టీ నేతలు గాలి వెంకటరెడ్డి, అల్లుపల్లి రాంబాబు, గూరు జగపతిబాబు, గాడు రామారావు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఎచ్చెర్ల, లావేరు మండలాల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, నాయకులు వావిలపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు, పైడి అన్నం నాయుడు, సంధ్యా గజపతి తదితరులు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం తీరని లోటని ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తశుద్ధి, అంకిత బావంతో పనిచేస్తే ఎటువంటి విజయాన్ని అయినా సాధించవచ్చునని చెప్పడానికి రామోజీరావు జీవితం ఒక ఉదాహణగా నిలుస్తుందన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే రామోజీరావు మృతిపై వీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, సువ్వారి గాంధీ సంతాపం తెలిపారు.

● **పొందూరు:** రామోజీరావు మరణం పత్రికా లోకానికి తీరని లోటని టీడీపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర బాస్కర్, పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద రామోజీ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

● **అరసవల్లి:** రామోజీరావు మృతి బాధాకరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నేత లతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, అంబటి లక్ష్మీరాజ్యం, కవ్వాడి సుశీల, డివిజన్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రామోజీరావు మరణంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **రణస్థలం:** ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రామోజీ ఇక లేరని తెలిసి ఎంతో బాధపడ్డానన్నారు. భావితరాలకు రామోజీ సేవలు తెలియాలని, ఇందుకనుగుణంగా రణస్థలంలోని తన డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్నారు.

● **గార:** రామోజీరావు మృతిపై పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పీస వెంకట రమణ మూర్తి, నాయకులు బడగల వెంకట అప్పారావు, గుండ భాస్కరరావు, గొండు వెంకట రమణమూర్తి, కె.ఆదినారాయణ, మళ్ల అబ్బాయినాయుడు, మళ్ల నర్సింగరావు, అరవల పెద్దబాబు, కైబాడి రాజు, షైగాపు ప్రభాకరరావు, గోర సురేష్, గిరి కోరాడ వెంకటరావు, పి.కృష్ణమూర్తి, ఎల్.రాధాకృష్ణ రెడ్డి, పి.వైకుంఠరావు, జేసీ దేవదాస్, కె.జగదీష్, శిమ్మ శ్రీనివాస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

● **అరసవల్లి:** రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో తాను అడుగుపెట్టిన అన్ని రంగాల్లో గొప్ప విజయాలను నమోదు చేసిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అలాగే రామోజీ మృతిపై ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామోజీరావుతో తనకు గల అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

● **రణస్థలం:** రామోజీరావు మృతికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) క్యాంప్ కార్యాలయంలో శనివారం సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు తేజ ఆధ్వర్యంలో బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు పాల్గొని రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **నరసన్నపేట/పోలాకి:** రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం రామోజీరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, సూరపు నారాయణదాసు, సాసుపల్లి కృష్ణబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు, కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు పట్టణానికి చెందిన శిల్పి వీఎస్ఎన్ఎస్ ఆచారి పెన్సిల్ ముల్లుపై రామోజీరావు చిత్రం గీచి నివాళులర్పించారు.

● **ఎల్ఎన్ పేట:** రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటని టీడీపీ నాయకులు కె.కృష్ణమాచారి, కె.మన్మథరావు, సీహెచ్ శ్రీని వాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఎం.మనోహర్‌నాయుడు, కె.తిరుపతిరావు, జి.మోహనరావు, ఎస్.మోహనరావు, ఎ.పోలినాయుడు, టి.అప్పన్న తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

● **కొత్తూరు:** రామోజీరావు మరణంపై మండల టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు, అగతముడి బైరాగినాయుడు, ఎద్దు దాసునాయుడు, రేగేటి కన్నయ్యస్వామి, మాతల గాంధీ, కొయిలాపు శ్రీనివాసరావు, రాజు, వెంకటరమణ, వెంకటకృష్ణ, పడాల నాగభూషణం, దుప్పల వాసు, విక్రమ్ తదితరులు ఉన్నారు.

● **పాతపట్నం:** పత్రికా రంగానికి రామోజీ చేసిప సేవలు మార్గదర్శకంగా నిలిచిపోతాయని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాప సభను పార్టీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● **మెళియాపుట్టి:** రామోజీ మృతి మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో రామోజీకి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సలాన మోహన్‌రావు, ఆనపాన రాజశేఖర్‌రెడ్డి, నంబాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** తెలుగునాట అక్షర యోధుడు రామోజీ అని మండల టీడీపీ అధ్యక్షుడు జీరు భీమారావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మృతికి సంతాపం తెలిపారు. సంతబొమ్మాళి, బోరుభద్రలో రామోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, నాయకులు కూశెట్టి భానుప్రకాష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● **టెక్కలి:** ఈనాడు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతిపై టెక్కలి టీడీపీ నాయకులు శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ, నాయకులు కోళ్ల లవకుమార్, పోలాకి చంద్రశేఖర్, మళ్ల బాలకృష్ణ, గురువెల్లి చిన్నమనాయుడు, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్, మెండ దమయంతి, ఇప్పిలి జగదీష్, దోని బుజ్జి, కూరాకుల యాదవ్ తదితరులు ఉన్నారు.

● **జలుమూరు (సారవకోట):** రామోజీరావు అకాల మరణం రాష్ట్రానికి తీరని లోటని మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. సారవకోట మండలం గుమ్మపాడు గ్రామంలో శనివారం రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కత్తిరి ఈశ్వరరావు, నవీన్, లంక రామారావు, కరజాన ప్రకాష్, బీసింగి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

● **హిరమండలం:** రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. హిరమండలంలో శనివారం రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జి.కామేశ్వరావు, తేజ, మిన్నారావు తదితరులు ఉన్నారు.

● **హరిపురం:** రామోజీ మృతికి మందస మండలం హరిపురంలో శనివారం ఘన నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన సమాజ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏర్పుల జోగారావు, పుల్లా వాసు, బైరశెట్టి గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.


కవిటి: జనసేన పార్టీ ఆధ్వర్యంలో..


ఇచ్ఛాపురం: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


హరిపురం: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


కంచిలి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న టీడీపీ నాయకులు


ఎచ్చెర్ల: టీడీపీ కార్యాలయంలో..


జలుమూరు: సారవకోట మండలంలో..


మెళియాపుట్టి: రామోజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం


సంతబొమ్మాళి: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


హిరమండలం: జడ్పీటీసీ బుచ్చిబాబు ఆధ్వర్యంలో..


కొత్తూరు: నివాళుర్పిస్తున్న టీడీపీ నాయకులు


ఎల్ఎన్ పేట/పాతపట్నం: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఫారెస్ట్ ఆఫీస్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు గాయపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫారెస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిల్లో పొందూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన జి.శ్రీనివాసరావు పరామర్శించేందుకు శుక్రవారం వెళ్లాడు. ఆసుపత్రి నుంచి బయటకు వస్తుండగా రైతుబజార్ మీదుగా ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తి శ్రీనివాసరావును ఢీ కొట్టాడు. దీంతో అతడి కాలు విరిగిపోయింది. స్థానికులు 108 సాయంతో అతడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులకు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ శనివారం కేసు నమోదు చేశారు.

లక్ష్మణరావు నేత్రాలు సజీవం


లక్ష్మణరావు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్: తాను చనిపోతూ కూడా మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించిన లక్ష్మణరావు నేత్రాలు సజీవంగా నిలిచాయి. నగరంలో నివశిస్తున్న సారవకోట మండలం సవరశివరాంపురం గ్రామానికి చెందిన తంప లక్ష్మణరావు (38) శనివారం కిడ్నీ సమస్యతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు తంప ఆది.. లక్ష్మణరావు నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. దీంతో ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావుకి సమాచారం అందించారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా జెమ్స్ ఆస్పత్రిలో లక్ష్మణరావు కార్నియాలు రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ఐ-టెక్నిషియన్స్ పి.సుజాత, ఉమాశంకర్ సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా నేత్రదాతకు రెడ్‌క్రాస్ సిబ్బంది సంతాపం తెలియజేసి, కుటుంబ సభ్యులను అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వారు 7842699321 ఫోన్ నెంబరులో సంప్రదించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ కోరారు

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


ఈవోకు విరాళాన్ని అందిస్తున్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విశాఖకు చెందిన దుర్గ వైష్ణవి శనివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయ అభివృద్ధి కోసం లక్ష రూపాయల విలువల గల రెండు ఏసీలను విరాళంగా ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. వారిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ టీఎస్ చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష..

రాజమండ్రికి చెందిన వేదనభట్ల భాస్కరశర్మ, రామలక్ష్మి శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,011 విరాళంగా ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామివారి జ్ఞాపికను ఈవో వారికి అందజేశారు.

రేపు హుండీల లెక్కింపు

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు సోమవారం ఆలయ అనివెట్టి మండపంలో చేపట్టనున్నట్టు ఈవో ఎస్.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షణలో ఈ నెల 10వ తేదీన చేపట్టనున్నట్టు ఆలయ ఈవో తెలిపారు.

సంయమనం పాటించాలి

ఆమదాలవలస: వైసీపీ నాయకులు, కార్యకర్తల కవ్వింపు చర్యలపై టీడీపీ క్యాడర్ సంయమనం పాటించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు తర్వాత అక్కడక్కడ జరుగుతున్న వైసీపీ కవ్వింపు చర్యలపై దాడులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలు అదుపులో ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కులు చెల్లించుకున్న మహిళలు


ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

సరుబుజ్జిలి: రాష్ట్రంలో కూటమి విజయంతో పాటు ఆమదాలవలస నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కూన రవికుమార్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంపై మండలంలోని యరగాం గ్రామంలో మహిళలు గ్రామ దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. శనివారం టీడీపీ యువ నాయకులు గురువు తిరుమలరావు ఆధ్వర్యంలో సుమారు నాలుగు వందల మహిళలు బిందెలతో ముర్రాటలతో గ్రామ దేవత ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి చల్లదనం పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు తిరుమలరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడి రాష్ట్ర ప్రజలను కాపాడాలని అమ్మవారిని గ్రామస్థులు వేడుకోవడం జరిగిందన్నారు. యువకులు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు డీజే పాటలతో గ్రామవీధుల్లో నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

పర్తియాత్ర అనుమతి పత్రం ఆవిష్కరణ


అనుమతి పత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పర్తియాత్ర ఈ ఏడాది సెప్టెంబరు 21, 22, 23వ తేదీల్లో నిర్వహించడానికి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ అనుమతి తీసుకు న్నామని జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు రఘు పాత్రుని లక్ష్మణరావు, సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్ మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న ఆలయ వార్షికోత్సవం

గార: గతేడాది నిర్మించిన మద్వేంకట నాయకస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారని భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు ఏవో ఎర్రా శారద తెలిపారు. విత్తనాలు కావాల్సిన చిన్న, సన్నకారు రైతులు గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఎకరానికి ఒక బస్తా చొప్పున్న, ప్రతీ రైతుకు నాలుగు బస్తాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. రాయితీపై అందిస్తున్న విత్తనాల నమోదుకు రైతులు తమ ఆధార్ కార్డు తీసుకువెళ్లాలన్నారు. ధర చెల్లించిన రెండు, నాలుగు రోజుల్లో విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ రైతు విత్తనాలు వేసే ముందు విత్తన మొలక శాతాన్ని పరిశీలించి 80 శాతం కంటే తక్కువ ఉంటే ఆ బస్తాలను ఆర్‌బీకేల్లో తిరిగి అందజేయాల్సినదిగా ఆమె కోరారు. రాయితీ విత్తనాలను ప్రతీ రైతు వినియోగించుకోవాలని కోరారు.

పీఏసీఎస్ కార్యవర్గం రాజీనామా

పొందూరు: పొందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యవర్గం శనివారం రాజీనామా చేశారు. నామినేటెడ్ కార్యవర్గంలో అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి డైరెక్టర్లు బొమ్మాళి గిరి, గూనాని కృష్ణ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్‌కు, పొందూరు పీఏసీఎస్ సీఈవో పాపినాయుడుకు రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ విషయాన్ని సీఈవో పాపినాయుడు ధ్రువీకరించారు.

ఆర్థిక సాయం

గార: పూసర్లపాడు గ్రామానికి చెందిన పర్ల యరకయ్య కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి లాసా ఫౌండేషన్ ద్వారా మెంబర్ వైస్ సర్పంచ్ అరవల పెద్దబాబు రూ.15 వేలు ఆర్థిక సాయం శనివారం అందచేశారు.

టీడీపీ విజయోత్సవాలు



పాతపట్నం: దుర్గమ్మ గుడి కాలనీలో కేక్ కట్ చేసి పంచుతున్న స్థానిక నేతలు

పాతపట్నం: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. బాణసంచా కాల్చడంతో పాటు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. పాతపట్నం దుర్గమ్మ గుడి కాలనీలో పాత పట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు గెలుపొందిన నేపథ్యంలో శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. వీధి కూడలిలో కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. సుదీర్ఘ కాలం తరువాత నియోజకవర్గంలో టీడీపీ గెలుపొందిన నేపథ్యంలో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. బాణ సంచాలను కాల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పైల బాబ్జీ, సైలాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన సంబరాలు

సంతబొమ్మాళి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అఖండ మెజార్టీ సాధించడంతో పాటు టెక్కలి ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు, ఎంపీగా రామ్మోహన్ నాయుడు అత్యధిక మెజార్టీతో ఎన్నిక కావడంతో గ్రామాల్లో సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. శనివారం బోరుభద్ర, మేఘవరం గ్రామాల్లో ఎర్రన్నాయుడు విగ్రహాలకు పాలభిషేకం చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

ర్యాలీతో హోరెత్తిన దిమిలాడ

నందిగాం: దిమిలాడలో శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామంలో బాణాసంచా కాలుస్తూ ఆటపాటలతో సందడి చేశారు. వీధుల్లో ర్యాలీ చేపట్టి నినాదాలతో హోరెత్తించారు. డిక్కల కిషోర్, నడుపూరు వైకుంఠరావు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు మళ్ల బాలకృష్ణ, జీరు నానీరెడ్డి, కూరాకుల యాదవ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన విజయోత్సవ ర్యాలీ

ఇచ్ఛాపురం: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి బెందాళం అశోక్ అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ సాధించడంతో కూటమి నాయకులు విజ యోత్సవ ర్యాలీ నిర్వహించారు. శనివారం బూర్జపాడు, డొంకూరు, పెద్ద లక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం గ్రామాల్లో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, దున్న లోకనాథం, గణపతి, శ్రీను, రామారావు, మోహన్‌రావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మిఠాయిల పంపిణీ

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో టీడీపీ విజయోత్సవ సంబరాలు సందర్భంగా ఇంటింటికి మిఠాయిలు పంపిణీ ఆ పార్టీ శ్రేణులు కొనసాగిస్తున్నారు. 12, 13, 14, 15, 16 వార్డుల్లో శనివారం టీడీపీ నాయకులు బోయిన బాలసునీత, తమ్మినేని గీతా విద్యా సాగర్, కూన రాము, ప్రసాద్ ఆధ్వర్యంలో పంపిణీచేస్తూ కూటమి అభ్యర్థి కూన రవికుమార్‌ను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



బోరుభద్రలో సంబరాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు



ఇచ్ఛాపురం: విజయోత్సవ ర్యాలీలో టీడీపీ, జనసేన నాయకులు



ఆమదాలవలస: విక్టరీ సింబల్ చూపుతున్న నేతలు

పాఠశాలల నిధులపై ఆడిట్

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సివిల్ వర్క్స్, మెయింటెనెన్స్ నిధులు వినియోగంపై శనివారం ఎమ్మార్సీ భవనంలో ఆడిట్ అధికారి ఎం.సురేష్ కుమార్ ఆడిట్ నిర్వహించారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళి మండలాల్లోని 44 పాఠశాలల్లో నిధుల వినియోగం తదితర రికార్డులను పరిశీలించారు. ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న గుంటూరు జిల్లా బాపట్ల లో జరగనున్న రగ్బీ పోటీలకు పురుషులు, మహిళల జిల్లా జట్లను సోమవారం ఎంపిక చేస్తు న్నట్టు రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డొంకాన రామకృష్ణ, పొన్నాడ పార్వతీశం తెలి పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 9గంటలకు జరుగు ఎంపికకు క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరుకావాలని, వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు 8500007272 నెంబరులో సంప్రదించాలని కోరారు.

జీవో నెంబరు 117ను రద్దు చేయాలి



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసిన యూటీఎఫ్ నాయకులు

నరసన్నపేట: ప్రాథమిక పాఠశాలలను బలోపేతానికి జీవో నెంబరు 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని శనివారం సంఘ నేతలు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేసి ప్రాథమిక విద్యను భ్రష్టు పట్టించిందన్నారు. ప్రతీ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు ఉండేలా కృషి చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న 25 వేల పోస్టుల భర్తీకి చంద్రబాబు నాయుడు భర్తీ చేస్తారన్న ఆశతో ఉన్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి, జిల్లా గౌరవాధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు, నేతలు టి.సుధీర్, కె.ఆదినారాయణ, ఎస్.రాజేష్, ఆర్.బాబూరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

కాశీబుగ్గ: ప్రభుత్వ పాఠశా లల్లో ఉత్తమ విద్యను అందిస్తా రని, పిల్లలను చేర్పించాలని హెచ్‌ఎం రేణుకాదేవి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు పెంటవీధి స్కూల్ ఉపాధ్యాయులు శనివారం వి ద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కలిగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ ఉర్లాన అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **జలుమూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని లింగాలవలస ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్.కమలకుమారి అన్నారు. లింగాలవలసలో శనివారం బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన పరిచారు. ఉపాధ్యాయులు గుండ ఈశ్వరమ్మ, జె.వాణిశ్రీ పాల్గొన్నారు.

ఎట్టకేలకు పారిశుధ్య పనులు



టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో ఎట్టకేలకు పారిశుధ్య పనులను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఈనెల 4న టెక్కలిలో ఇందిరాగాంధీ కూడలిలో మాట్లాడుతూ.. టెక్కలిలో పారిశుధ్య లోపం ఉందని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలపడంతో పంచాయతీ అధికారులు స్పందించి శనివారం పనులు ప్రారంభించారు. డీఎల్పీవో ఐవీ రమణ ఆధ్వ ర్యంలో ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు పర్య వేక్షణలో పారిశుధ్య కార్మికులు పనులు చేపట్టారు. చెత్తను పట్టణానికి దూరంగా తరలించి రోడ్లను పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను, మట్టిని తొలగించారు.

పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజీనామా

నరసన్నపేట: రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవికి బెహరా హైమావతి శనివారం రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన ఈమె కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతున్న నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేసి సంబంధిత అధికారులకు రాజీనామా పత్రాన్ని పంపారు.

మండలానికి మూడోవిడత పాఠ్యపుస్తకాలు

నందిగాం: నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత పాఠ్యపుస్తకాలు శనివారం మండలానికి చేరాయి. పదో తరగతికి సంబంధించి 5,599 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో-1 జి.నర్సింహులు తెలిపారు. పాఠశాలలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అధికారికంగా నీలమణి దుర్గమ్మ అమ్మవారి పండగ



కనకదుర్గమ్మ దేవస్థానం ఈవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు/పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గమ్మ పండగలను అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవోతోనూ దేవదాయ శాఖ అధికారులతోనూ దీని నిమిత్తం తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ప్రతి ఏటా వార్షికోత్సవం, ఏడేళ్లకు ఒకసారి పెద్ద పండగలను అధికారికంగా చేపట్టేందుకు సహకరిం చాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పాలభిషేకం



వజ్రపుకొత్తూరు: మండల కేంద్రంలోని ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు టీడీపీ నాయకులు శనివారం పాలభిషేకం చేశారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో పాటు ఎన్నికల కోడ్ ముగి సిన నేపథ్యంలో విగ్రహాలకు ఉన్న ముసుగులు తొలగించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అర్జవెల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన శిరీష



టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కూటమి అఖండ విజయం సాధించడం, జిల్లాలో అన్ని స్థానాల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేసినందుకు శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

జలుమూరు: కరవంజ పంచాయతీ మట్టవానిపేటలో శనివారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు మండప పూజలు, హోమం నిర్వహించారు. గ్రామ పురోహితులు తెలికచర్ల సాంబమూర్తి నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారి తిరువీధిలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టు కుంది.

చితమానిపేటలో..

చితమానిపేట(పోలాకి): చితమానిపేట గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం గ్రామ పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 51 మంది దంపతులు ప్రత్యేక కలశ పూజలు చేపట్టారు. ఆదివారం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వార్షి కోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పలువురు గ్రామస్థులు ఆలయానికి వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

యువకులకు క్రికెట్ కిట్ అందజేత

సంతబొమ్మాళి: ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలికినందుకు గాను సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో స్థానిక యువకులకు టీడీపీ నాయకుడు తంగి వెంకటరమణ క్రికెట్ కిట్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్

ఎచ్చెర్ల, జూన్ 8: బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష శనివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట), ఐతం (టెక్కలి)లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు నాలుగు కేంద్రాల్లో మొత్తం 990 మంది విద్యార్థులకుగానూ 874 మంది హాజరయ్యారు. 116 మంది గైర్హాజరయ్యారు.

అందుబాటులో విత్తనాలు

సోంపేట: రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు అన్నారు. పట్టణంలోని రైతుభరోసా కేంద్రంలో విత్తనాల కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. విత్తనాల కొరత రాకుండా చూసుకుంటున్నామని ప్రతి రైతుకు విత్తనం అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలి పారు. ఏవో బి.నరసింహమూర్తి తదితరులున్నారు.

క్రీడలతో జాతీయ స్థాయిలో గుర్తింపు

జలుమూరు (సారవకోట): క్రీడల్లో రాణిచిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. జగన్నాథపురంలో నిర్వహించిన ఆదివాసీ ప్రీమియర్ లీగ్ విజేత జట్లకు శనివారం బహుమతులు అందచేశారు కార్యక్రమంలో తహసీల్దార్ జన్ని రామారావు, చిన్నాల వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

అబద్ధాలాడే నాయకులకు సరైన గుణపాఠం

● మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ

పలాస, జూన్ 8: అబద్ధాలాడే నాయకులకు ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పారని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సార్వ త్రిక ఎన్నికల్లో ఓటమి చెందిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, పలాసలో మాజీ మంత్రి అప్పలరాజు అప్పుడే అబద్ధాలాడడం ప్రారంభించారని, ప్రజలు గుణపాఠం చెప్పినా వీరిలో మార్పు రాలేదన్నారు. శిరీష విజయం తన జీవితంలో చూడలేదని, బతికున్నంత కాలం తనకు ఈ విజయం గుర్తుండిపోతుందని ఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో జన సేన నేత పవన్‌కల్యాణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారని కొనియాడారు. దారితప్పిన వ్యవస్థను చంద్రబాబు నాయుడు బాగు చేస్తారన్న నమ్మకం ఉందని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత ఆయన తీసుకుంటారన్నారు. కిడ్నీ ఆసుపత్రి ఆలోచన చంద్రబాబుదేనని, అక్కడ స్థలాన్ని కూడా తామే ఎంపిక చేసి శంకుస్థాపన చేస్తే మంత్రి తన ఖాతాలో జమ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రంగానే నడుస్తోందని, పరిశోధన కేంద్రంలో ఒక్క పరికరమైనా కొత్తగా అమర్చారా అని ప్రశ్నించారు. అప్పలరాజు తన కుమార్తెను అనేక విధాలా ఇబ్బం దులు పెట్టారని, రాష్ట్రంలో అంతటి నీచుడు ఉండడన్నారు. అతనికి ఇంతకన్నా పెద్ద శిక్ష పడాలని ఒక తండ్రిగా తాను కోరుకుంటున్నానన్నారు. పలాసను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అంతకు ముందు ఈనాడు పత్రికాధిపతి రామోజీరావు మృతి పట్ల శివాజీ సంతాపం తెలిపారు. రామోజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, గురిటి సూర్యనారా యణ, దువ్వాడ శ్రీకాంత్, యవ్వారి మోహనరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, శంకర్, శశిభూషణరావు, జోగ మల్లి, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు అప్పగింత



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న ఎస్ఐ షరీఫ్

పలాస, జూన్ 8: రైలులో చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు శనివారం రైల్వే ఎస్ఐ షరీఫ్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 18 మంది రైల్వే ప్రయాణికులు తమ సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారని, సిబ్బంది నిఘా వేసి దొంగలను పట్టుకుని ఫోన్లను రికవరీ చేశారన్నారు. ఈ మేరకు బాధితులకు వాటిని అప్పగించామన్నారు. రూ.5లక్షల 4వేల విలువైన ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రికవరీకి కృషి చేసిన హెచ్‌సీ కోదండరావు, ఎం.సంతోష్‌కుమార్, పి.రమేష్, దేవేంద్రనాథ్, టి.తేజ, లోకనాథంలను అభినందించారు. రైలులో మొబైల్స్ చోరీ జరిగితే సంబంధిత ఈఎంఐ నెంబరుతో సహా తమకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.

జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న వంకల మాధవరావు

పలాసరూరల్: జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. చిననీలావతి గ్రామంలో శనివారం ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, తక్షణం నూతన ప్రభుత్వం స్పందించాలన్నారు. పలాస కేంద్రంగా జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలని, విదేశీ జీడిపిక్కల దిగుమతిని ఆపాలని కోరారు. పలాస పరిసర ప్రాంతాల్లో 300 జీడి పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, వివిధ సంఘాల నేతలు కోదండరావు, అరుణోదయ రామారావు, వంకల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే వారధి ఎస్ఎఫ్ఐ

● టెక్కలి డిప్యూటీ డీఈవో విలియం

● విద్యా వైజ్ఞానిక శిక్షణ శిబిరం ప్రారంభం

ఆమదాలవలస: విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఎస్ఎఫ్ఐ వారధిగా పనిచేస్తోందని టెక్కలి డిప్యూటీ డీఈవో విలియం అన్నారు. శనివారం రూరల్ మండలంలోని ఎఫ్‌సీఐ గిడ్డంగుల వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏ సమయంలో ఆపద వచ్చినా ముందుండే సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. వివిధ సమస్యలపై పోరాటం చేసిన ఘనత ఈ సంఘానిదే నన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అరికె అశోక్ విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, కొత్తకోట అప్పారావు, ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు నవిత, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దుప్పల గోవిందరావు, భవిరి కృష్ణ మూర్తి, నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.చందు, బి.హరీష్, పలువురు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పొలం పనుల్లో రైతుల నిమగ్నం

నరసన్నపేట: తొలకరి వర్షాలు కురియడంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఎదలు వేసేందుకు, విత్తనాలు జల్లేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. పొలం గట్లను బాగు చేస్తున్నారు. రైతు కూలీలతో పనులు చేయిస్తున్నారు. మడపాం, మాకివలస, జమ్ము, సుందరాపురం, కంబకాయి తదితర ప్రాంతాల్లో పొలం పనులు ముమ్మరమయ్యాయి. నాగళ్ల మరమ్మతులు చేయిస్తున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు చేస్తున్నారు. మెట్టు ప్రాంతాల్లో వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలను వేస్తున్నారు. మరొక వైపు కూలీ రేట్లు గత ఏడాదితో పోల్చుకుంటే 10 శాతం మేరకు పెరిగాయి. ఉపాధి పనులు జరుగుతుండడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది.

ముమ్మరంగా వరి ఎదలు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి ఎదలు వేసేందుకు గాను లోతట్టు గ్రామాల రైతులు సిద్ధ మవుతున్నారు. వర్షాలు ప్రారంభమైతే పల్లపు ప్రాంతాల్లో పండించడం కష్టంతో కూడుకున్న పని కావడంతో కార్తె ప్రారంభం ముందు నుంచే పొలాల్లో దుక్కులు చేసి వరి ఎదలను వేస్తున్నారు. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు ఇంతవరకు సరఫరా చేయలేదు. అయినప్పటికీ ప్రైవేటు వ్యాపారుల వద్ద కొను గోలు చేసి ఎదలను వేస్తున్నారు. తురకపేట, చిట్టిమండలం, దబ్బపాడు, సుమంతాపురం, వాడవలస, ధనుకువాడ తదితర గ్రామాలకు చెందిన రైతులు వరి ఎదలను వేస్తున్నారు.



నరసన్నపేట: గట్లు కొడుతున్న రైతులు



తురకపేటలో ట్రాక్టర్‌తో దుక్కి..